నద్దుపోగలం? అంటూ బాధ పడ్డారు శ్రీమతి వాగమణి. ఎస్.బి.హెచ్.లో ఆమె క్లర్క్‌గా పని చేస్తున్నారు.

బాధలు పడే వాళ్ల వైనం వొకలా వుంటే బాధలు పెట్టేవారి వాదనలు ఇంకా చిత్రంగా వున్నాయి. టాంక్‌బండ్ రోడ్‌లో అమ్మాయిల్ని చూసి నానాగోలా చేస్తూ వొక చేత్తో చికెన్ బర్గర్, మరో చేత్తో కోక్ సీసాతో వచ్చి పోయే వారిని ఎక్కిరిస్తూ ఖుషీ చేస్తున్న, 26 ఏళ్ళ కుమార్ కృష్ణను పలకరించాను. దిమ్మతిరిగే వాదన చెప్పాడు.

"చూడు సార్! ఏంది తప్పు! వొల్లంతా కన్పడేలా డ్రెస్ చేసుకొని, వయసు మల్లినా లిప్‌స్టిక్ వేసుకొని దొంగ చూపులు చూస్తూ ఏదైనా మేం అంటే నవ్వుకుంటూ పోతారు ఆడోల్లు. మంచిగా వున్న దాన్ని ఎవ్వడేం అనడు. ఎక్స్‌ట్రా వేషాలేసేదాన్ని చూస్తే ఎవడికి మాత్రం ఏడిపించ బుద్దవదు. అయినా వాళ్లూ హేపీ మేము హేపీ... అంటా లైట్‌గా తీస్కో సారూ" అంటూ బైక్ స్టార్ట్ చేసి దూసుకుపోయాడు ఆ కుర్రాడు మరొకడు.

"ఏదైనా హద్దులో వుంటేనే ముద్దు. మరీ ఓవరాక్షన్ చేస్తేనే ఇబ్బంది. మనుషులకి ఐటెండిటీ క్రైసిస్ తప్పదండి. ఎవరో ఒకరు ఏదో మాట మంచో చెడో అనకపోతే మనిషి నిలవలేడు. ఇది నేచురల్ ఇన్‌స్టింక్ట్. ఈవ్ టీజింగ్ అంటే ఇష్టపడే అమ్మయిలూ వున్నారు. చూపించమంటారా" అని సవాల్ చేశాడు ఎస్.కె.కాశ్యప్ అనే 26 ఏళ్ళ సేల్స్ ఎగ్జిక్యూటివ్.

"నో ప్రాబ్లమ్ మాటకు మాట చెబితే నోరు మూసుకుపోయే మగవాళ్లే ఎక్కువ. వొక్కవెధవ మరీ రెచ్చిపోతే చెప్పు తీసుకుకొడితే సరి. అందరూ మనకే సపోర్ట్ కొస్తారు. స్త్రీలు ఎంత బలహీనులో అంత బలవంతులు. ఆ సంగతి వాళ్లకు తెలికే బాధపడడం" అంటూ విశ్లేషించింది సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల విద్యార్థిని మల్లిక జోసెఫ్. ఈవ్ టీజింగ్ పట్ల ఈ రకం యుద్దాలు రోజూ చేస్తున్నామని వాపోయింది. బేసిక్‌గా ఈవ్‌టీజింగ్ వో సమస్యేనని చాలా మంది వొప్పుకున్నారు. ఎవరెవరి మేధోస్థాయిలను బట్టి వారు పరిష్కారాలను తయారు చేసుకున్నారు. చేసుకుంటున్నారు. వొక పరిష్కారంతో పోయేది కాదు ఈ సమస్య. రోజు వారీ ఇదీ ప్రత్యేక పని. కౌంటర్ ఎన్‌కౌంటర్.

చాలా సందర్భాల్లో ఈవ్ టీజింగ్‌కి ఎటువంటి ఆధారం వుండదు. పోలీస్ స్టేషన్ వరకు వెళ్లే కేసులు స్వల్పాతి స్వల్పం. ఈ అభిప్రాయ సేకరణలో పలువురు 'ఈవ్‌టీజింగ్'ని ఎదుర్కోనేందుకు పలు సూచనలు చేశారు. ఈవ్ టీజింగ్ బారిన పడుతున్న ఎందరికో ఇవి సహకరించి, వారిని కర్తవ్యోన్ముకులను చేసేలా వున్నాయి.

◐ కాన్షియస్‌గా వుండడమే పరిష్కారం. బస్తీలో, బజారులో, మార్కెట్లో బస్ సీట్లో ఎక్కడున్నా పరిసరాల పట్ల నిరంతర అబ్సర్వేషన్ అవసరం. ఎవరు ఏ వైపు నుంచి దూసుకొచ్చేది కనీసం గమనించి జాగ్రత్త పడగలం.

◐ నోటికొచ్చినట్టు మాట్లాడుతూ వెనకబడే వారిపై వెంటనే రియాక్ట్ కావద్దు. జనం రద్దీగా వుండే వరకు రానిచ్చి ఇలాంటి వ్యక్తులను సడన్‌గా నిలదీసి అరవండి. పది మంది పోగై బుద్ది చెబుతారు.

◐ ఆటోల్లో స్కూటర్‌లలో వెడుతున్నప్పుడు రేర్‌వ్యూ మిర్రర్‌లో జాగ్రత్తగా వెనుక చూసుకోండి. ఎవరైనా వెంబడించేది లేనిది తెలుస్తుంది. దీని వల్ల ప్రమాదాన్ని వూహించి జాగ్రత్త పడవచ్చు.

◐ వేసుకునే దుస్తుల విషయంలో శ్రద్ధ అవసరం. ఫ్యాషన్‌గా వుంటూనే హుందాగా వుండే దుస్తులు వేసుకోవడం మంచిది. కేవలం ఫ్యాషన్ మోజుల్లో వేసుకునే దుస్తులు సరిగా సెట్ కాకపోతే ఆ వూటంతా కామెంట్ల వర్షమే.

◐ వెనుకపడి వేధించే వారి మాటలు వొక్కసారి నవ్వు తెప్పించవచ్చు. దయ చేసి ఆ పని చేయకండి. మీరు ప్రోత్సహిస్తున్నారనుకుని రెచ్చిపోయే ప్రమాదం వుంది.

◐ రోమ్‌లో వున్నప్పుడు రోమన్‌లా వుండాలి. మనం ఏ ప్రాంతంలో వుంటున్నామో ఏ సమూహాల మధ్య నివశిస్తున్నామో వారి మధ్య అలాగే వుండక తప్పదు. అలాంటి దుస్తులు ఆ తరహా వేషధారణ తప్పవు. ఏ మాత్రం ఆడ్‌గా కనిపించినా అల్లరే అల్లరి. ఏం చేస్తాం జనం సైకాలజీనే అంత!

◐ వొక్కసారి మీరు రియాక్టయ్యే విధానాన్ని బట్టి అవతలి వాళ్ళు రెచ్చిపోవచ్చు. సో చాలా బాలెన్స్‌డ్‌గా వ్యవహరించండి. రౌడీ గ్యాంగులు వుంటే అడ్డాలు, పోగయ్యే సెంటర్లను ఎవాయిడ్ చేయండి. మాటకి మాట చెబుతూ రెచ్చగొట్టడం అన్ని సార్లు మంచిది కాదు.

◐ ఇంటికి ఫోన్లు చేసి వేధించే వెధవల పట్ల అప్రమత్తత అత్యవసరం. అవతలి వాళ్లతో సంభాషణ కొనసాగించడం ఆత్మహత్యాసదృశ్యం. పదే పదే రిపీట్ కాల్స్ చేస్తుంటే సమీప పోలీస్ స్టేషన్‌లో రిపోర్ట్ ఇచ్చి, ఆ ప్రతిని మీ లోకల్ ఎక్స్ఛేంజ్ వారికి కాపీ పెట్టి ఫోన్‌ని టాప్ చేయించండి. అవతలి వాళ్ల పని పోలీసులే పడతారు.

◐ ఆత్మరక్షణ విద్యను తప్పనిసరిగా నేర్చుకోండి. కరాటే కుంగ్ ఫూ లాంటి వాటిలో శిక్షణ తీసుకోవడం సేఫ్.

నిజానికివన్నీ అనాగరికమైన బాధాకరమైన సందర్భాలు. నిస్సహాయ స్థితిలో తీసుకునే జాగ్రత్తలు. వొక మనిషి ఇంట్లోంచి బయటకెడుతోందంటేనే ప్రాణం బిక్కుబిక్కుమనే రోజులివి. మన అక్కలు, కూతుళ్ళు, చెల్లెళ్ళు అందరూ రోజు పడుతున్న బాధలివి. తోటి మనిషి ఇంత అభద్రంగా ఇన్ని సూచనలు పాటిస్తూ బ్రతికే స్థితి పట్ల మగవాళ్లకు స్పృహ లేనంతకాలం ఈవ్‌టీజింగ్ మేఘం ఈ నేలపై కన్నీటి జడి కురి పిస్తూనే వుంటుంది.

■■




తెరస్మరణీయుడు,
చిరస్మరణీయుడు
స్వర స్మరణీయుడు
ఆత్రేయ

మే 7 జయంతి
సందర్భంగా
తెలుగు సినీ సంగీత
సాహిత్య పరిశీలకుడు
'రాజా' అందిస్తున్న
ప్రత్యేక వ్యాసం

# మీ బాబు, అతని సౌమ్యమైన, మృదువైన ప్రపంచం.



## అతని తొలి ఘన ఆహారం కూడా అదే మృదువైనదిగా ఉండేలా చూడండి.




లేబుల్ పై గల సూచనలను జాగ్రత్తగా పాటించండి.

మీ పాప వయస్సు ఇప్పుడు 4 నెలలు దాటింది. అతనికి పాలు ఒక్కటే కాకుండా ఇంకా ఇతర ఆహారం కూడా అవసరం. ఘన రూపంలో ఉండటమేగాక, మృదువైన పోషణ నిచ్చేది కూడా అయి ఉండాలి.

నెస్టమ్ వంటిది - తేలికగా జీర్ణమయ్యే చంటి పిల్లల తృణధాన్యపు ఆహారం. మీ బాబుకి సరయిన తొలి ఘన ఆహారం. బియ్యంతో తయారు చేయబడింది.

పాలల్లో కలిపితే చాలు. దానిని చెమిచాతో మీ బాబుకి తినిపించండి. అతడు త్వరితంగా పెరిగేందుకు అవసరమైన పోషక పదార్థాలు అతడికి లభిస్తాయి.

మీ బాబు పెరుగుతున్నకొద్దీ మీరు అతనికి కొత్త కొత్త రుచులను క్రమక్రమంగా అలవాటు చేయడం అవసరం. మృదువైన పద్ధతిలో యిలా చేయడంలో మీకు నెస్టమ్ సహాయ పడుతుంది. పాలు లేకుండా తయారు చేయబడిన ఒకే ఒక తృణధాన్యపు ఆహారం యిది ఒక్కటే. కాబట్టి యిది చాలా సులభంగా దేనితోనైనాసరే కలిసిపోతుంది-మెత్తగుజ్జుగా చేసిన అరటి పండ్లు, పెరుగు, కూరగాయలు........

మీ బాబుకి తినిపించండి. నెస్టమ్ యొక్క మృదువైన మంచితనంతో అతను పెరగడం మీరు చూసుకోండి.

**నెస్టమ్**

తేలికగా జీర్ణమయ్యే బేబీ సిరియల్

ఉచితం :
నెస్టమ్ రెసిపి బుక్‌లెట్

Nestlé ఈ చిరునామాకు వ్రాయండి: పోస్ట్ బ్యాగ్ 25, న్యూఢిల్లీ-110016

McCann/Nestum/40897 TL


**IMPORTANT NOTICE: MOTHER'S MILK IS BEST FOR YOUR BABY. AFTER 4 MONTHS OF AGE GIVE BABY CEREAL FOODS IN ADDITION TO MOTHER'S MILK.**

**महत्वपूर्ण सूचना : माँ का दूध आपके बच्चे के लिए सर्वोत्तम है। चार महीने की उम्र के बाद बच्चे को माँ के दूध के साथ-साथ अन्नयुक्त आहार दीजिए।**

# కుంటి నడకలు

ఆ కార్డు ముక్కను తపాలా బంట్రోతు నాచేతి కిచ్చి అప్పటికి సరిగ్గా అర్ధ గంటకూడా కాలేదు. ఆ లోపలే ఆ కార్డును ఆరారు పన్నెండుసార్లయినా చదువుకొన్నాను. చదువుతూ ఆలోచించాను. ఆలో చిస్తూ చదివాను. ఎన్నిసార్లు చదివినా ఆ నాలుగు వాక్యాలే!

చేతులు వ్యక్తీకరిస్తాయి. కార్డు తిరగపడుతుంది. వెనకప్రక్క నా అడ్రస్సు ... ఆ అడ్రసుకు ... ఎడమ ప్రక్కనే జైలు ముద్ర ... దాని కింద వార్డన్ సంతకం – నన్ను వెక్కిరిస్తూ. మళ్ళీ కార్డు తిరగపడుతుంది. ఆ నాలుగు వాక్యాలే. ఆ నాలుగు వాక్యాలు మానవత అనే గదికి నాలుగు గోడలై అందులో నన్ను బంధిస్తాయి.



ఆ నాలుగు వాక్యాలే నా వ్యక్తిత్వాన్ని సవాలు చేస్తూ నలభై విధాలుగా నన్ను ఆలోచింపచేశాయి. ఎన్ని విధాల ఆలోచించినా నాకు ఉత్తరం రాసిన వ్యక్తి ఆంతర్యం పట్టు దొరకలేదు. కారణం మా పరిచయం చాలా స్వల్పం. ఆ స్వల్ప పరిచా యాన్నే ఫణంగా పెట్టి అతగాడు నాకు అంటగట్టి తలచుకొన్న బాధ్యత మాత్రం తలకు మించిందే. ఆ బాధ్యతను ఒక సవాలుగా తీసుకోవడమా? వదిలేయడమా? ఒక దానితో ఒకటి సంబంధం లేని రెండు అభిప్రాయాలు. విడిపోతూ కలుస్తూ ... కలుస్తూ విడిపోతూ... మనస్సును మధిస్తూ –

అనుకోనట్లుగా మళ్లీ ఆ కార్డు మీద దృష్టి పడు తుంది. అర్థం కాని వాక్యం మాటి మాటికీ దృష్టిని ఆకట్టుకొన్నట్లుగా. నాలుగు వాక్యాలు. కంఠతాపట్టి నట్లుగా నోటికొచ్చేసిన నాలుగే నాలుగు వాక్యాలు. వాటిని మళ్లీ చదవడమెందుకన్న అభిప్రాయాన్ని 'మనస్సున్న మనిషిగా నీ కర్తవ్యాన్ని ఆలోచించు" అని హెచ్చరిస్తాయి.

ఉన్నతమైన ఆశయంతో వాస్తవికంగా ఆలోచిం చడం చాలా కష్టం. ఈ కష్టాన్ని కొని తెచ్చుకోవడం ఎందుకనుకుంటే – 'ఎవడో దారిన పోతున్న దానయ్య. నాల్గైదు నెలలుగా కలుసుకొంటు న్నాడు. కలసినప్పడు మంచిగా మసలుకొన్నాడు. అది వాడి అవసరం. ఆ మాత్రం పరిచయానికే ఆ పరిచయమనే ఎరతో నన్నొక చేపను చేయాల నుకుంటే? వాడి గాలంలో పడడానికి నేనొక వెర్రి వెంగళప్పనా?' అని ఒక్క మాటతో తప్పించుకోవచ్చు.

అయితే మనిషికి మనిషికీ మధ్య నమ్మకం ఒకటి ఏడ్చిందే?

ఆత్మీయతలను ... అనుబంధాలను ... బరువు బాధ్యతలను కడకు ఈ కుటుంబ వ్యవస్థను తెగని బంధంగా ముడేసి నిలబెట్టుతున్నది నమ్మకమే కదా? ఈ తాలిక జగత్తులో వ్యవహారమంతా కేవలం ఒక్క నమ్మకం ఆధారంగా సాగిపోతూ ఉంది కదా? ఆ నమ్మకాన్ని ఒక పిల్లవాడు పల కమీద బలపంతో రాసిన అక్షరాలను ఎంగిలితో తుడిచేసినంత సులభంగా తుడిచేస్తే?

జీవితానికి అర్థమే ఉండదు.


అందుకే ఒక వ్యక్తి నమ్మకాన్ని కాదనడానికి మనస్సు వొప్పకోలేదు. పోనీ! ఆ బాధ్యతను నెత్తి కెత్తుకుందామంటే దానికీ మనస్సు ఒప్పడం లేదు..

ఈ భావ వైరుధ్యం ఒక విచిత్రమైన స్థితి ఆస్థితిలో ఆలోచన ఒక చోట మొదలై మరొక చోట తెగిపోతూ వుంది. అసలు ఆలోచనే దుఃఖానికి మూలం. దుఃఖాన్ని కన్నీళ్లు తగ్గిస్తాయి. మరి ఆలో చనా భారాన్ని? – ఒక ఆత్మీయుడు. బాధలను ... భావాలను ... కష్టా సుఖాలను ... కన్నీళ్ళను సమభావంతో పంచుకొనే వ్యక్తి. అతడి కోస మే ఆ కార్డు ముక్కను చేతపట్టుకొని బయలుదేరాను.

** ** **

గంట పది అయింది.

కడిగి తోసినట్లున్న ఆకాశంలో సూర్యుడు మిడి సిపడుతున్నారు. బరువు బాధ్యతలకు కాళ్లొచ్చిన ట్లుగా రోడ్ల మీద పోటీలు పడుతూ జనం ఆ జనాన్ని వెంటపడి తరుముతున్నట్లుగా ఎండ.అసలే యిరుకు రోడ్లు. మురుగు నీటి కాలువలను భూగర్భంలోనికి తరలించే ప్రయత్నంలో రోడ్లను తవ్వుతున్నారు. పది యిరవై అడుగుల లోతుకు. ఆ రోడ్లు అగాధాలై లోయలను తలపింపచేస్తూ యిరు ప్రక్కల సన్నని కాలి బాటలుగా మిగిలాయి.


పులికంటి కృష్ణారెడ్డి
గురజాడ వీధి



'ఆసియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో నమోదైన ఆశియా ఖండ విశిష్ట వ్యక్తి, ప్రముఖ నాటక, సినీ రచయిత, నటుడు

**శ్రీ కాశీ విశ్వనాథ్**

ఆంధ్రజ్యోతి కోసం ప్రత్యేకంగా రాసిన స్టోరీ

**'ఇదీ సినేమా కతే'**

వచ్చే సంచికలో

ఆ కాలి బాటల మీద చేతి కర్రలను పోగొట్టుకున్న గుడ్డి వాళ్ళలా జనం... పడ్తూ లేస్తూ ... వంచిన తలలెత్తకుండా ... శాసిస్తున్న వ్యవస్థను మోస్తున్నట్లుగా.

వాళ్లతో కలసి నేనూ!

ఆ క్షణం వరకు ఆ కార్డు కారణంగా తలలో ఒకే ఒక్క ఆలోచన – లోతుగా వేళ్లూని. ఇవుడు ఆ ఆలోచనను మెడపట్టి ప్రక్కకు నెట్టి ఎన్నెన్ని ఆలోచనలో? ...

"కల్లు మానండోయ్ బాబూ! కండ్లు తెరవండి!" అంటూ ఎప్పుడో మహాత్మాగాంధీ గొంతెత్తి చాటాడు. ఆ చాటింపు గాలిలో కలసిపోయింది. మహాత్మా కండ్లు తెరవమంటే ప్రజలు కండ్లు మూసుకొన్నారు. చీకటి రాజ్యం. అదే ఏ ప్రభుత్వానికైనా కావలసింది. ఆ చీకట్లో ప్రజల బలహీనతలను వైట్ చేసుకొన్నారు. వారుణీ వాహినీ పేరుతో కల్లు సారా బ్రాందీలు వరదలు కట్టాయి. ఆ సొమ్ముతో అభ్యుదయాన్ని సాధించినట్లు చాటుకొన్నారు. ఓట్లు దండుకొన్నారు. దేశాన్ని పాలించారు. పాలిస్తున్నారు. పాలిస్తారు కూడా. గొర్రె దాటు ప్రజలు కండ్లు తెరవనంతవరకూ!

పాలకులు అధికారాలకు బానిసలు!

ప్రజలు వ్యసనాలకు బానిసలు!!

బానిసలకు బాధ్యతలకు పొత్తు కుదరదు.

బాధ్యతా రహితమైన దిశగా కొట్టుకొనిపోతూ పాలకులు ప్రజలూ!

ఈ నేపథ్యంలో దౌర్జన్యాలు ... దోపిడీలు ... మానభంగాలు ... బ్లో అవుట్‌లు ... ఎన్‌కౌంటర్లు మితిమీరిపోయాయి. గుండెలను అరచేతుల్లో పట్టుకొని బిక్కుబిక్కుమంటూ జనం. వీటిని మోస్తూ ప్రతినిత్యం పత్రికలు రక్తంతో తడిసి ఏడుస్తున్నాయి. అసలే గూని తోడుకు దొబ్బుడ్డు రోగమన్నట్లు కొంపలకు కొంపలనే కూలుస్తూ సారా మహమ్మారి. ఈ పరిస్థితుల మీద ఓదార్పు నీళ్లు చల్లడం కాదు– దీన్ని చిత్తు చేయక తప్పదన్న అవసరాన్ని మొట్టమొదట ఆంధ్రరాష్ట్రంలో మహిళా లోకం గుర్తించింది.

ఆ అవసరమే తిరుగుబాటుకు దారితీసింది.

మరొకరు మరొకరు తిరుగుబాటు చేస్తే ఏమయ్యేదో ఏమో కానీ ఆడవాళ్ళ ఓట్లతో అందలమెక్కి కూర్చున్న ప్రభుత్వం తలవంచక తప్పలేదు. ముందూ వెనక ఆలోచించకుండా ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రంలో మద్యపాన నిషేధాన్ని అమలుపరచింది.

ఆలోచిస్తూ నడుస్తూ ... నడుస్తూ ఆలోచిస్తూ ... నా లోకం నాదిగా నేను. అయితే ఎదురైన సంఘటన మళ్లీ నన్నీ లోకంలోకి లాగింది.

ఎదురుగా పోలీసు జీప్!

ఆ జీప్‌కు రెండు ప్రక్కలా తుపాకులు పట్టుకుని నలుగురు పోలీసులు... ఏదో ఘన కార్యాన్ని సాధించిన తృప్తి నిలబడిన తీవి వ్యక్తం చేస్తూ ఉంటే జీప్‌కు చూపును తగిలించి సబ్ యిన్స్పెక్టర్... నలుగురు నడితరం మనుషులను డ్రాయర్ బనియన్లతో జీప్‌లోకి ఎక్కిస్తూ హెడ్!

చుట్టూ గుమిగూడిన జనం. ఒకరినొకరు చూసుకొంటూ ... ముసి ముసిగా నవ్వుకొంటూ. తానులో పంచలా నేనూ వాళ్ళల్లో ఒక్కణ్ణే కదా? నిలబడ్డాను – కారణం తెలుసుకొందామని.

నాలుగు కాకులు ఒక చోట చేరితే, అరుస్తాయి!

నలుగురు ఒక చోట చేరితే ఏదో ఒకటి వాగుతారు!

"వాళ్లింటికి మెడ్రాస్ నుంచి యిద్దురు చుట్టాలొచ్చినారంట. వాళ్లు వస్తా వస్తా ఒక సీసా మందు తెచ్చినారంట. నలుగురు కూర్చోని మందుకొట్తా ఉణ్ణారు. అది చూసేకుందికి యిరుగు పొరుగు మనసుల్లో పురుగు దొల్చినట్టుండాది. పోలీసోళ్లకు పోన్ జేసినారు. వాళ్లొచ్చి వీరుళ్లు శూరుళ్లు మాదిర తమ ప్రెతాపం చూపిస్తా ఉండారు."

"ఏవి చట్టాలో చట్టుబండలో. మనవంతా భారతీయులం. మనదంతా ఒకే జాతి. ఒకే మాటంటారు. అట్టాంటప్పుడు మదరాసులో తాగితే కాని తప్పు తిరపతిలో తాగితే అవుతుందా? బాగుండ్లా యవ్వారం?"

"కొంప వాళ్లదే. దుడ్లూ వాళ్లవే. వాళ్ల కొంపలో కూసోని వాళ్లు తాగితే యాణ్ణో కొంపలే కూల్చేసినట్టు ఈ పోలీసోళ్లు ఎగిరెగిరి పడ్తా ఉండారే?– ఈ మాత్రం నీతి నిజాయితీగా డూటీ జేస్తే యిన్ని దోపిడీలు "యిన్ని దొంగతనాలు ... యిన్ని మానబంగాలు – "

సామాన్యుడి గుండె పంబ పలికినట్టు పలకలా ఉంది. సమాధానంగా కండ్లల్లో దుమ్ము కొట్టి జీప్ వెళ్లిపోయింది.

కండ్లు నులుము కొంటూనే నేను బయలుదేరాను.

తెగిన ఆలోచన అతుక్కొనింది. రెండు రైలు పెట్టెలు ఒకదానితో వొకటి తగులుకున్నట్లుగా.

అంతేకదా? ప్రజలను చైతన్యవంతులుగా చేసి నైతిక విలువల దిశగా పయనించే ప్రయత్నాల జోలికి పోకుండా మద్యపాన నిషేధాన్ని కేవలం చట్టబద్ధం చేసి కూర్చుంటే ఏమవుతుంది? ఇదో పరిస్థితి యిలానే అఘోరిస్తుంది. పైగా కంచె చేను మేసే పరిస్థితిని ప్రభుత్వం తనకు తాను కల్పించినట్లయింది.

అవకాశం దొరకాలే కానీ అధికారులు... రాజకీయ నాయకులు సద్వినియోగం చేసుకోవడంలో అందె వేసిన చేతులు గదా? వాళ్ల అండదండలతో మాఫియా ముఠాలు ... అక్రమ రవాణాలు .... లంచగొండి తనాలు చాపకింద నీళ్లులా విస్తరించాయి. ఎవడి స్థాయిని బట్టి ... ఎవడి పరపతిని బట్టి వాడు అక్రమ రవాణాలో ఆరితేరారు. దొరికిన మట్టుకు దోచుకొని తినడానికి దొరలై కూర్చున్నారు.

ఆ దొరల్లో ఒక్క దొరే రాములు!

రాములు నాకు పరిచయం కావడానికి ముందు ఒక్క సీసా మందు సంపాదించుకోవడం అమెరికా దేశానికి వీసా సంపాదించుకోవడమంత కష్టంగా ఉండేది.

ఎవరి మాటో ఎందుకు? నావరకు నేను రెండు దశాబ్దాలకు పైగా తాగుతున్నాను.

"ప్రభుత్వం మద్యపానాన్ని నిషేధించింది కదా? వ్యతిరేకించి తాగడం ఒక పౌరుడుగా చట్టాన్ని వ్యతిరేకించినట్లే కదా?" అని చట్టబద్ధుడైన వ్యక్తి నాతో వాదించాడు.

"చట్టబద్ధం చేసినా చెయ్యకపోయినా తాగడం తప్పు తప్పే. మందుకంటే సిగరెట్టు తాగడం ఆరోగ్యానికి ఎక్కువ హానికరం. అయితే ప్రభుత్వం సిగరెట్టు తాగడం చట్ట బద్ధం చేసింది కాబట్టి అది మంచి అలవాటై పోతుందా? కాబట్టి ఏ అలవాట

యినా తప్ప అవునా కాదా? అని ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవల్సింది మనిషి. ప్రభుత్వం కాదు. రెండేండ్ల క్రిందటి వరకు తాగడాన్ని చట్టబద్ధం చేసి అనుమతించిన ప్రభుత్వం యిప్పుడు తాగడం తప్పని చట్టాన్ని అమలుపరిస్తే? ..."

చట్టానికి కట్టుబడిన వ్యక్తి చేతులు కట్టుకొన్నాడు.

సామాన్యుడికి కనీస సౌకర్యాలు ... భద్రత కల్పించలేని ప్రభుత్వం తాగడం తప్పని చెప్పే అర్హతను ఎప్పుడో కోల్పోయింది. అందుకే మద్యపాన నిషేదం అమలులో వున్న రాష్ట్రంలో పౌరుడిగా ఉండి కూడా నేను ప్రభుత్వ నిర్ణయానికి చేతులు కట్టుకోలేదు. సా అలవాటు మేరకు గొంతు తడుపుకొంటూనే వున్నాను. నేనే కాదు. నాలాగా ఎందరెందరో...

అది రాములు లాంటి వాళ్ల చలవ!

రాములు బక్కపలచగా చెక్క పేడుకు ప్రాణం వచ్చినట్లుగా ఉంటాడు. దీగూళ్లల్లో దివ్వెల్లా వెలుగుతూ చిన్న చిన్న కండ్లు. వాటినివేరు చేస్తూ సూది మొనలాంటి చక్కని ముక్కు. లొక్కి దవడలకు కప్పగా పెరిగిన పలచని గడ్డము . బలిష్టమైన పొడుగాటి చేతులు! అయితే పాపం ఒక కాలు కుంటి. ఆ కాలు వాడి చేతి కంటే చిన్నది. ఒంటి కాలిమీద రెట్లావు దుడ్డుకర్ర సహాయంతో వాడు నడుస్తూ ఉంటే – లేడిపిల్ల చెంగు చెంగున ఎగిరిదూకినట్లు ఉంటుంది.

వాడిని నాకు పరిచయం చేసింది బాలకృష్ణ.

ఆ బాలకృష్ణ కోసరమే నేనిప్పుడు పోతూ ఉండడం.

రాములు దినం మార్చి దినం వస్తాడు. కన్జీకటి పడ్తూ పడ్తూ వుంటుంది. ఆ వేళవుడు వాడికోసరమే ఎదురుచూస్తూ నేను మిద్దెపైన వుంటాను. వాడు అవలీలగా మిద్దె మెట్లెక్కి వస్తాడు. టేబుల్ ముందు నిలబడతాడు. అటు ఇటు చూస్తాడు. వరనుండి బాకును తీసినట్టుగా బొడ్లో దోపుకున్న మందు సీసా తీస్తాడు. టేబుల్ మీద పెడతాడు. ఒంటికాలిమీద దుడ్డుకర్ర ఆధారంతో నిలబడి నా ముఖంలో ముఖం పెట్టి చూస్తాడు. ఏదో సాధించిన విజయగర్వంతో వాడి కళ్ళు వికసిస్తాయి. సన్నని పెదాల మీద చిరునవ్వు మెరిసినట్టు మెరిసి మాయమవుతుంది. డబ్బులుండి యిస్తే తీసుకుంటాడు. తీసుకున్న చేత్తోనే ఒక సెల్యూట్ కొడతాడు. దుడ్డుకర్రను నేలకానించి చివ్వలా పైకి లేస్తాడు. లేచిందే పరుగు అన్నట్టుగా నిమిషాల్లో మిద్దె మెట్లు దిగి బాటమీద గుంపులో కలిసిపోతాడు.

ఆరోజు చేతిలో డబ్బులు లేకుంటే–

"మర్నాడొచ్చినవుడు తీసుకో రాములూ!" అంటే మాటలో కూడా ఒక సెల్యూట్ కొట్టి మారుమాట్లాడకుండా వెళ్ళిపోతాడు. 'డబ్బు రాలేదే' అన్న బాధ వాడి ముఖంలో వెదికినా కనిపించదు.

అదే వాడిలో నాకు బాగా నచ్చిన గుణం!

అంతేకాదు. ఒక సమయం వాడు ఏ పరిస్థితుల్లో అయినా బార్డర్ దాటిపోలేకపోతే ఆ ఉదయమే వస్తాడు. నేను ఇంట్లో వుంటే సరేసరి. లేకుంటే వచ్చేవరకు ఎదురుచూస్తూ కూర్చుంటాడు. నేను వస్తానే 'ఈ పొద్దు నేను పొయ్యేది లేదు సార్. మీ ఏర్పాటో మీరు చేసుకోవలసిందే" అని చెప్తాడు.

అది ఎదుటి వ్యక్తిని ఇబ్బంది పెట్టకూడదన్న వాడి సంస్కారం.

'సంస్కారవంతుడు ఇలాంటి పని చేయవచ్చునా?' అని అడిగితే–

ఏం చేస్తాడు? ఏ పని చెయ్యలేని కుంటోడు. వాడికీ ఒక పొట్ట వుంది. తోడుగా నాలాంటివాళ్ళ ప్రోత్సాహం వుంది.

నాకు తెలియకనే వాడిమీద గౌరవం పెరిగిపోయింది.

ఆరోజు వాడు కొంచెం ఆలస్యంగా వచ్చాడు. మామూలుగానే ముందు సీసా తీసి టేబుల మీద పెట్టాడు. వంచిన తలెత్తకుండా తల గోక్కుంటూ నిలబడ్డాడు.



## ఆడవాళ్ళకు ఓటు వచ్చిన విధం

1908 ఎమ్మెలిన్ పాంక్ హర్ట్స్ అనే స్త్రీ బ్రిటీష్ ఎన్నికల్లో స్త్రీలకి ఓటు హక్కు వుండాలంటూ పోరాడింది. ప్రభుత్వం ఆమెను ఒక బరితెగించిన ఆడదిగా పరిగణించి లాకప్‌లో పెట్టింది. ఆమెతోపాటు అనేక మంది మహిళలు అరెస్ట్ అయ్యారు. చెరసాలలోనే ఒక పెద్ద మహిళా ఉద్యమం ఆరంభమయింది. ఆ తర్వాత చాలా మంది చదువుకున్న ఆడవారు ఉద్యోగాలలో ప్రవేశించడంతో 1918లో ముప్పై ఏళ్ళకి పైబడిన స్త్రీకి ఓటు హక్కు ఇవ్వొచ్చని బ్రిటీష్ ప్రభుత్వం తీర్మానించడం జరిగింది. అదే ప్రపంచంలో ఆడవాళ్ళకి మొట్టమొదటిగా ఓటు హక్కు రాబడిన సంఘటన అయింది.

–హిమజా రమణ

"ఏమయింది రాములూ?" అని అడిగాను.

"లేటయిపోయింది గద సార్. తప్ప నాది కాదు. దార్లో బస్సు చెడిపోయింది" అన్నాడు ఆలస్యానికి బాధపడుతూ.

"ఫరవాలేదులే రాములూ! కూర్చో" అన్నాను.

కూర్చున్నాడు.

"అవును రాములు! రైళ్ళల్లో తనిఖీచేస్తున్నారు. బస్సుల్లో మూటాముల్లె పెట్టె బేడా ఒక్కటి విడిచిపెట్టకుండా చెక్ చేస్తున్నారు. చెక్ పోస్టులు వుండనే వున్నాయి. వీటన్నిటినీ తప్పించుకుని నువ్వు..."

"కుంటోణ్ణి గద సార్!"

"అంటే– వికలాంగులకు ప్రభుత్వం రాయితీలిచ్చినట్టు అధికారులు నీకేమైనా..." అన్నాను నవ్వుతూ.

"అదేం కాదు సార్. అయ్యో పాపం కుంటోడు. ఇట్టన్నా బతుక్కోనీలే! అని నామింద రోంత దయ. అయినా నేను గూడా వాళ్ళ మాట కాదంటూ వుంటే గద సార్."

"అంటే?"

"ఒకసారి ఎక్సైజోళ్ళకు దొరికిపోతి సార్. వాళ్ళు స్టేషన్‌కు తీసుకునిపోయేది సార్. ఆడ రెండు దెబ్బలేసిరి. మల్లా వాళ్ళల్లో వాళ్ళే మల్లగుల్లాలు పడి 'ఒరే కుంటోడా! అయ్యో పాపం కుంటోడని ఇడ్సిపెడ్తా వుండాం. అయితే స్టేషన్ మామూలు మాత్రం జాగర్తరే!' అన్నారు. వాల్ల మాట పకారమే నెలనెలా స్టేషన్ మామూలు వెయ్యి రూపాయలు చెల్లించేస్తా వుండా. ఇంక రైల్వే పోలీసోళ్ళు. వాళ్ళకు దినవూ అరబాటిల్ ఇచ్చేయాల. ఇట్లానే ఇంకా శానామంది వుండార్లే సార్. ఎవురాటా వాళ్ళకు జేరిపోతే ఏదో మిగిలింది నాకు. అయినా చూడబోతే యిదంతా రాదీసుకోని నామిందనే ఒక కత రాసేటట్టుగా వుండాదే" అంటూ వెళ్ళిపోయాడు.

"నిషేధమా నీ అడ్రస్ ఎక్కడ?" అని అరవాలనిపించింది.

"నీ గొంతులో!" అని సమాధానం వస్తుంది.

అందుకే నోరు మూసుకున్నాను.

ఆ మరునాడు కాదు– ఆ మరునాడైనా వాడు తప్పక రావాలి. రాలేదు. రాలేకపోతే ముందుగానే చెప్తాడు కదా? కాబట్టి ఏ వేళకైనా తప్పక వస్తాడు అన్న నమ్మకం సడలలేదు. ఎదురుచూడడం తప్ప లేదు.

ఆ రాత్రి నాకు ఒక శివరాత్రి అయింది.

ఆ ఒక్క రాత్రికే ఏదో వ్రతభంగమయినంత బాధ.

వాడేమయ్యాడో? ఏమో? అన్న ఆలోచనకు తావులేకుండా వాడు రాసిందే ఆ కార్డు. ఆ కార్డు చేత పట్టుకుని ఆలోచిస్తూ నడుస్తున్నాను.

వేసవికాలం. ఆ వేళకే తీసి కాస్తున్న ఎండ. గాలి సమ్మె చేసినట్టుంది. బాటకు రెండువైపులా చెట్టు చేమలు, ఆకు అల్లాడకుండా తపస్సులో లీనమైన



## ఆడ మొహం మగ తనం

అమ్మాయిల్ని ఆకట్టుకోవ లంటే ఎంతైనా అడంగి ఫేసు వున్న వాళ్లకే అడ్వాంటేజ్ అంటూ పరోక్షంగా కొందరు 'లేత' హీరోల మీద సాలీడ్ జోక్ పేల్చాడు ఫారూఖ్ ఖాన్. నాలోనో నానా పటేకర్‌లానో మగతనంగా వున్న మగాళ్ళ దగ్గరికి ఆడాళ్ళు అంత తొందరగా రారు. ముందు వాళ్ల మాట కలిపితేనే కదా తర్వాతి వ్యవహారం. అంచేత సల్మాన్‌లా, బాబీడియోల్‌లా ఆడ మొహం వుండాల్సిందేనంటూ ఎక్కి రించాడు.

మునుల్లా వున్నాయి. వాటిని సవాలుచేస్తూ నా మనసులో అలజడి. జడివానలో తడుస్తున్న మనిషి తలదాచుకోవడానికి తపిస్తాడు. పరుగులు తీస్తాడు.

ఆలోచనల జడివానలో నేను– నింపాదిగా నడుస్తున్నాను. రెండు కిలోమీటర్లకు పైగా నడక సాగినట్టే తెలియలేదు.

బాలకృష్ణ ఇంట్లో అడుగు పెట్టాను.

ఏడూళ్ళ మణేగాడంటారే వాడు బాలకృష్ణ ముందు బలాదూర్. అయినా ఆ వేళప్పుడు ఇంట్లోనే వున్నాడు. అంతవరకు నయమే!

పదును వానకు పదరని బాలకృష్ణ నన్ను చూస్తూనే అదిరిపడి పైకి లేచాడు. పుట్టి మునిగిపోతున్నా పుచ్చపూవులా నవ్వడం వాడికే చెల్లు. ఆ నవ్వుతోనే నన్ను ఆహ్వానించాడు. కూర్చోమని కుర్చీ చూపించాడు. నేను కూర్చోకుండానే ఆ కార్డును వాడి చేతికిచ్చాను.

కన్నెత్తి వాడు దాన్ని చూడలేదు!

"పరుగెత్తా పాలు తాగేదానికన్నా నిలబడి నీళ్ళు తాగమన్నారు పెద్దోళ్ళు. దేనికైనా నిదానం ప్రధానం. మనిషన్న తర్వాత అయినవాళ్ళుంటారు. కాని వాళ్లుంటారు. స్నేహితులుంటారు. ఎవరో ఒకరు. ఏదో ఒకటి రాస్తానే వుంటారు. కొంపలు మునిగిపొయ్యే సంగతే అనుకుందాం. కూర్చోని ఆలోచించాలి గానీ..."

మారుమాట్లాడకుండా కూర్చున్నాను.

వాడూ నా ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడు. ఆ నాలుగు వాక్యాలూ చదివాడు.

"ఆ!... కుంటోణ్ణి స్క్వాడ్ పట్టుకొనింది. వాడిప్పుడు జైల్లో వున్నాడు. విడిపించమని అడుగుతున్నాడు. అయితే ఏం చెయ్యాలంటావ్!.... విడిపించాలంటావా?"

"అది అడగడానిక్కదా నీ దగ్గరికొచ్చింది?"

"మీరు పెద్దోళ్ళు. మీ గుండెకాయ కూడా పెద్దదే. అయితే వాడెవుడో? వాడే వూరో! మనకు తెల్దు. ఈ పొద్దు మనం జామీనుంచి విడిపిస్తాం. వాడు అదే చాలనుకోని పరారవతాడు. అప్పుడేం చెయ్యాల?"

"నన్ను నమ్మండి. నేనలా చెయ్యను" అంటున్నాడు గదా!

"మాటలు చెప్పడం వేరు. చెప్పిన మాటను నిలబెట్టుకోవడం వేరు. ఇంకా మీరు సత్య హరిశ్చంద్రుడి కాలంలో నిలబడి మాట్లాడ్తే?"

"నాలుగైదు నెలలుగా వాడి ప్రవర్తన చూస్తున్నాం గదా? మాటకు చేతకు ఎక్కడైనా ఎప్పుడైనా ఏమాత్రమైనా తేడా కనిపించిందా?"

"అది వ్యాపార లక్షణం. చెప్పిన మాట ప్రకారం నడుచుకోకపోతే వాణ్ణి కాదని మనం ఇంకొకణ్ణి వెదుక్కునే అవకాశం వుంది కదా! అదే వాడి భయం. దానికీ దీనికీ ముడి పెట్టడంలో అర్థమే లేదు. మనకు అమ్మినట్టు వాడు ఎంతోమందికి అమ్మినాడు గదా? వాళ్ళందరినీ కాదని మనమే దొరికినామా ఆ కుంటినాకొడుక్కి?"

"అందరి సంగతి వేరు. మన సంగతి వేరు. వాడిని మనం దగ్గరకు చేర్చాం. అంటే వాడికి ఎంతో కొంత నమ్మకాన్ని ఇచ్చినట్టే గదా?"

"ఇదీ బలే బాగుందాదే? నమ్మించి వాణ్ణేమన్నా మనం ఈ వ్యాపారంలో దింపినామా? ఎవుడైనా పట్టుకుంటే విడిపిస్తామని హామీ ఇచ్చినామా? లేదే! అందరికీ అమ్మినట్టు మనకూ అమ్మినాడు. మన అవసరం కుందికీ మనం కొనుక్కున్నాం. అంతమాత్రానికే నాగులూ నీళ్లొదిలి నమ్మకాన్ని దారాదత్తం చేసినట్టు మాట్లాడ్తే?"

"బాలూ! మనం స్నేహితులం."

"కాదన్న నా కొడుకెవరు?"

"ఈ అనుబంధం ఎన్నాళ్లది?"

"నాళ్ళది గాదు. ఏండ్లది."

"అవును గదా? మరి యిన్నేండ్లుగా మనలో చెక్కుచెదరకుండా నిలబడింది ఏదైనా వుంటే– అది ఒక్క నమ్మకమే."

"అంటే?"

"అంటే– బాలకృష్ణ అనే వ్యక్తికి ఎప్పుడైనా ఎలాంటి అవసరమైనా కలిగితే ఆదుకోవడానికి నేనున్నాను. నాకూ అలాంటి అవసరం కలిగితే బాలకృష్ణ వున్నాడు అనే నమ్మకం."

"అది నిజమే."

"అయితే మనం స్నేహితులుగా కలిసినపుడు ఈ మేరకు రాత కోతలేమైనా రాసుకున్నామా? హామీలిచ్చుకున్నామా? దేవతలను అడ్డం పెట్టుకుని ప్రమాణాలు చేసుకున్నామా? లేదే? మన అనుబంధంలో మనకు తెలియకుండానే ఈ అభిప్రాయం చిన్న తొట్టిలో మహావృక్షం పెరిగినట్టు పెరిగింది. కాదంటావా?"

చెట్టులో కాయ వుంటుంది. చేతిలో రాయి వుంటుంది. కొట్టడానికి కావలసింది ఏకాగ్రత. ఏకాగ్రత చిత్తశుద్ధితో అలవడుతుంది. ఆ చిత్తశుద్ధితో కొట్టిన దెబ్బతో బాలకృష్ణ కొంచెంసేపు గిలగిల కొట్టుకున్నాడు. అయితే మరుక్షణమే కర్తవ్యం గుర్తొచ్చి గలగల నవ్వాడు.

న్యాయవాదిని నియమించుకోవడం... సాల్వెన్సీ సర్టిఫికెట్లు తెచ్చుకోవడం.. కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేయించడం– అన్నీ చకచకా సాగిపోయాయి.

రాములు జైలునుంచి విడుదలయ్యాడు.

వాడు విడుదలైన సంతోషం కంటే మా బాధ్యత నుంచి విడుదలైన సంతోషమే గొప్పగా వుంది.

"సార్! మీరు చేసిన మేలు ఈ జన్మలో మరిచిపోను. వాయిదా వాయిదాకు తప్పకుండా హాజరవతాను. నన్ను నమ్మండి.." అంటూ రెండు చేతులు జోడించాడు. ఎడమ భుజం ఆధారంగా నిలబడిన దుడ్డు కర్రను రెండు చేతుల్తో పట్టుకున్నాడు. నేలకు తాటించాడు. దాని ఆధారంతో ఒక్క ఎగురు ఎగిరాడు– రెక్కలొచ్చిన పక్షిలా.

ఆ తరువాత వాడు నాకు కనిపించలేదు.

బహుశా ఈ భయంతో వ్యాపారాన్ని మానుకున్నాడేమో? అని సరిపెట్టుకున్నాను. దాదాపు వాడి మాటే మరచిపోయాను.

* * *

ఆరోజు తూర్పు దిక్కు పగటి కోసరం పురిటినొప్పులు పడ్తూ వుంది. ఆ దృశ్యం చీకటి వెలుగుల పట్టుదారాలతో కలనేసిన పట్టుచీరలా మనోహరంగా వుంది. ఆ వేళకే ఊరినీ బస్టాండ్‌నీ ముడేస్తున్నట్టుగా జనప్రవాహం. ఆ ప్రవాహంలో బాలకృష్ణను గుర్తుపట్టడానికి గుండె కన్నుల్లోకి

(తరువాయి 67వ పేజీ)

# (12వ పేజీ తరువాయి)

ఎగదన్నుకుని వస్తుంటే ఎదురుచూస్తా నేను.

ఆ రోజు మా ప్రయాణం మదరాసుకి.

ఏ పరిస్థితుల్లోనూ అనుకొన్న సమయానికి రాక పోవడం బాలకృష్ణ ప్రత్యేకత. ఎదురుచూసి ఎదురుచూసి విసుగు పుట్టిన క్షణాల్లో వస్తాడు. అప్పుడు టిక్కెట్ల కోసరం... బస్సులో కూర్చోడానికి తావు కోసరం నానా యాతన. అంతా హడావిడే!

అనుకున్న వేళకంటే అయిదు నిమిషాలు ముందుగా వస్తే ఈ ఇబ్బందులుండవు కదా? అని నేను చెప్పడం. వాడు ఈ చెవితో విని ఆ చెవితో వదిలేయడం గానే సాగిపోతూ వుంది కాలం.

అప్పటికి అర్థగంటకు పైబడింది వాడికోసరం నేను ఎదురుచూస్తూ బస్టాండ్‌లో నిలబడి. 'కొంప దీసి ప్రయాణం సంగతే మరచి నిద్రపోయాడా?' అన్న సందేహం. ఫోన్‌చేసి తెలుసుకుందామని ఆ ప్రక్కనే వున్న టెలిఫోన్ బూత్ వద్దకు గబగబ నడిచాను. లోపల అడుగు పెట్టాను.

పెట్టిన అడుగు అటు ఇటు కదల్లేదు. కంటిమీద రెప్ప పడలెదు. కలా? నిజమా? అన్న సందేహం.

నన్ను చూస్తానే ఎగిరిపడి లేచి సెల్యూట్ కొట్టిన చేతినైనా దించకుండా ఒంటికాలి మీద నిలబడి రాములు!

పెదాల మీద వొళ్ళు విరుచుకుంటూ చిరునవ్వు.

చిత్రమయింది జీవితం. అది ఎప్పుడు మనిషిని అందలాలెక్కించి ఆకాశంలో తిప్పతుందో? ఎప్పుడు నిర్దాక్షిణ్యంగా అథఃపాతాళానికి నెట్టుతుందో అని ఆలోచిస్తున్నాను.

మామధ్య మౌనంగా మరికొన్ని క్షణాలు.

"కూర్చోండి సార్! ఫోన్ చేస్తారా?"

బాలకృష్ణ వస్తే రానీ. రాకపోతే పోనీ. ప్రయాణం వాయిదాపడ్తే పడనీ. అని కూర్చున్నాను.- పదిరో జులనాటి జ్ఞాపకం కండ్లల్లో నీటిచుక్కయి తళుక్కుమంటుంటే-

"కాఫీ తెస్తాను సార్"

"కాఫీ వద్దు కానీ- రాములూ ఆ తర్వాత కథ చెప్పు"

"ఏముంది సార్ చెప్పడానికి? ఒకే ఒక సబ్జెక్ట్ ఇంగ్లీష్ ఒకే ఒక్క మార్కుతో పోకుంటే ఎస్సెస్సీ పాసయ్యేవాడిని. వికలంగుల కోటాలో ఏదో ఒక ఉద్యోగం సంపాదించుకునేవాణ్ణి. ఆ అవకాశం జారిపోయింది. పోనీ! వికలాంగుల కోటాలో ఒక పబ్లిక్ టెలిఫోన బూత్ అయినా ఇప్పించుకుం దామంటే పాట వేలమీద పలికింది. ఎక్కడినుంచి తెచ్చేది సార్? జానెడు పొట్టకూటికే పలుబాట్లు పడ్తూ వుంటే వేలు లంచంగా ఇవ్వగలనా? అందుకే వేషం మార్చాను. మాట మార్చాను. 'కుంటోణ్ణి బాబూ! ఒక దర్మం చెయ్యండి బాబూ!' అని చెయ్యి చాపడం తప్పలేదు. లోకంమీద పడ్డాను. ఇదే బస్టాండ్‌లో సార్. నేను మీకు తెచ్చిస్తావుంటినే

## సరిగమల మెట్లు

ధర్మవరంలోగల ఐరావతేశ్వర దేవాలయం ఎదురుగా వున్న బలిపీఠంపైకి వెళ్ళడానికి కొన్ని రాతి మెట్లున్నాయి. ఈ రాతి మెట్లపై అడుగుమోపగానే అవి సరిగమపదనిసలు పలుకడం విశేషం. ఎంతో నేర్పుగా శిల్పులు మలచిన ఈ సోపానాల్లో రాగాలస్థాయి కూడా హెచ్చు తగ్గులుగా ఉంటుంది. మెట్లపైకి ఎక్కుతున్న కొద్దీ రాగస్థాయి పెరుగుతుంది. శిలలో సంగీతాన్ని పొదిగిన శిల్పుల మేధో జనితకు ఎవ్వరైనా అబ్బురపడాల్సిందే.

—హిమజా రమణ

మందుసీసా బొడ్లో దోపుకుని. అచ్చం అలాగే సార్. సీసా చేతులు మారింది. పళపళమంటున్న పచ్చనోట్లు సీసా తెచ్చినవాడి జేబులో చేరాయి. క్షణాల్లో జరిగిపోయింది ఈ తతంగమంతా. అప్పడే నాలో కూడా ఓ ఆలోచన తళుక్కుమని మెరిసింది.

చెప్పండి సార్! కూటికి తక్కువయినా గుణానికి తక్కువలేని కుటుంబంలోనే పుట్టాను. అంతో ఇంతో చదువుకున్నాను. అయినా ఈ అక్రమ వ్యాపారానికి వొడిగట్టాను. దీన్ని ప్రోత్సహించింది ఎవరో చెప్పండి సార్!" అంటూ రాములు తల పైకెత్తి ఒక్క చూపు విసిరాడు.

చూపులా అవి? కాదు. నా ఎదను సూటిగా గుచ్చుతున్న ప్రశ్నల పిడిబాకులు!

"వికలాంగుల కోటాలో నా హక్కుగా ఇవ్వాల్సిన ఈ టెలిఫోన్ బూత్ ఇవ్వడానికి వేలు లంచంగా తీసుకున్న అధికారులవి కుంటిమనసులా? ఆ లంచం ఇవ్వడానికే నేను చెయ్యరాని అక్ర- వ్యాపారానికి దిగితే అందులో నెలనెలా వెయ్యి రూపాయలు స్టేషన్ మామూలుగా భాగం పంచుకున్న అధికారులవి కుంటి మనసులా? ప్రతి దినం ఒక అర్థ బాటిల్ లంచంగా నా దగ్గర బలవంతంగా గుంజుకొన్న రైల్వే పోలీసులవి కుంటిమనసులా? ఇంత శ్రమపడి తెచ్చిస్తే జల్సాగా తాగేసి 'పోరా కుంటినాకొడకా!' అని డబ్బులు ఎగేసి నా బలహీనతపై దెబ్బతీసినవాళ్ళవి కుంటిమనసులా? వీళ్ళందరికీ ఇలాంటి అవకాశం కల్పించిన ప్రభుత్వానిది కుంటిమనసా? చెప్పండి సార్. ఒంటికాలి కుంటోడు ఏ అంగవైకల్యం లేని మనుషులను అడుగుతున్నాడు. చెప్పండి సార్!"

రాములు చూపులు నిలదీసి అడుగుతున్నాయి. ఏమని చెప్పేది?

ఓదార్చేవాళ్ళు లేని ఒంటరితనంలోకి పారిపోయి తనివిదీరా ఏడవాలనిపించింది- ఆ అవకాశం కూడా కరవైన ఈ లోకంలో!

## ఇన్‌కంటాక్స్ కబుర్లు

ఇన్‌కంటాక్స్ బకాయిలు కట్టని సినీతారల ఆస్తుల జప్తుకోసం బొంబేలో ఈ మధ్య పెద్దకోలాటం జరిగింది. రాజేష్‌ఖన్నా భవంతి వొకటి వేలానికి పెట్టారు. చివరికి సగం బకాయి కట్టడంతో వదిలానుకోండి! ఇన్‌కంటాక్సు కట్టడంలో షారూఖ్‌ఖాన్ ఫస్ట్ వుంటాడట. ఆశాఖ అతగాడికి ఇందు నిమిత్తం సన్మానం కూడా చేసింది.


**తమిళ దేశంలో ఘక్కలి ప్రసిద్ధికెక్కిన సమయపురం శ్రీ ముత్తు మారియమ్మయొక్క కృపాకటాక్షం లభించే కోటానకోటి ఆంధ్ర భక్తులకు ఇది ఒక అద్భుతమైన అవకాశం**

తలచిన సమయంలో సాక్షాత్కరించు సమయపురం శ్రీ ముత్తు మారియమ్మ కృపవల్ల తమ కుటుంబములోను, జీవితంలోను సకలైశ్వర్యములు, స్థలవృద్ధి, సకలదేవతా అష్టలక్ష్మి కటాక్షములు లభించుటకై గత 25 సంవత్సరములుగా సమయపురం శ్రీ ముత్తు మారియమ్మవారి అనుగ్రహం పొంది తమిళ భక్త కోటి ప్రజల కుటుంబములోను, జీవితంలోను సకలైశ్వర్యములు కల్పించి, తమిళ భక్తుల మధ్య పేరు ప్రఖ్యాతలుగడించిన కీర్తి శేషులు, మహాత్ములైన శ్రీ శ్రీ ఎస్. భగవతి అమ్మవారి



కుమారుడు, పారంపర్య వృత్తి, వారసులైన సమయపురం సాక్షాత్తు శ్రీ ముత్తు మారియమ్మవారి అనుగ్రహంతో శ్రీ శ్రీ ఎస్. శాస్త్రిదాస్ స్వాములవారి వల్ల తమ కుటుంబములోను, జీవితంలోను గల మంచి చెడులు గ్రహించి తమయొక్క భవిష్యత్తుని గురించి తెలుసుకొనుట, తమ న్యాయమైన తలచిన కార్యములన్నియు సిద్ధించును. వివాహం వంటి



శుభకార్యాలలో ఆటంకములు కలిగే ఆడ, మగవాళ్ళకు మరియు వివాహం జరిగి అనేక సంవత్సరములై సంతాన ప్రాప్తి కలగనివారు, వృత్తి, ఉద్యోగ వృద్ధి పొందనివారికి, అనారోగ్యంగలవారికి మరియు తమ తమ కుటుంబములో కలిగే చికాకులను తొలగించుటకై శ్రీ స్వాములవారిని సమక్షంలో దర్శించి దేవతానుగ్రహంతో సకలైశ్వర్యములు పొందగలరు. తాము స్వయంగా రాలేనివారు తమ పేరు, వయస్సు, కోరికలు ద్వారా ఏమిటనేది వివరాలు క్లుప్తంగా తెలుగులో వ్రాసి, తమ చిరునామాతో గల ఒక రూపాయి కవరును జతపరచి S. Sasthri Thas Swamigal, Sakthi Nilayam, Post Box No: 619, Tiruchirapalli-620 008, Tamilnadu, S. India అనే చిరునామాకు పంపినచో అది అమ్మవారి సన్నిధిలో వుంచి అమ్మవారి అనుగ్రహంతో ప్రసాదములు పంపబడును. సమయపురం నుండి 8 కిలోమీటర్లు దూరంలో గల తిరుచ్చిరాపల్లిలో 25 సంవత్సరములుగా మా శక్తి నిలయం వైభవంగా జరుగుతుంది. శ్రీ స్వాములవారు విశేష పూజల నిమిత్తం ఇతర ఊళ్ళకు వెళ్ళిన సమయాలలో ప్రతి శుక్ర, ఆదివారాలలో S. Sasthri Thas Swamigal, Sakthi Nilayam, 39, Chinna Chetty Street, Tiruchirapalli-620 008 అనే విలాసములో తాము సంప్రదించవచ్చును. ఆంధ్రభక్తులు శ్రీ ముత్తు మారియమ్మవారికి కానుక నిమిత్తం తమకు తోచినది శ్రీ స్వాములవారి పేరుతో తిరుచ్చిరాపల్లిలో వున్న మా శక్తి నిలయంనకు ఎం. ఓ. ద్వారా పంపకోరుతున్నాము. గమనిక: శ్రీ స్వాములవార్ని దర్శించుటకు, ఆశీర్వాదం పొందుటకు ఆంధ్రభక్తుల సౌకర్యార్థం అతి త్వరలో విజయవాడలో మా శక్తి నిలయము ప్రారంభించగలము.